# దక్షిణ అయోధ్యకు "నూతన"శోభ

- భద్రాద్రి రామాలయం అభివృద్ధి పనులకు వేగం పెంచాలి
- ఆలయ విస్తరణ,ప్రాకార నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి
- టిటిడి ఆధ్వర్యంలో ఖమ్మంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం స్థల పరిశీలన,
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ తో మంత్రి"తుమ్మల" సమీక్ష



2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 11 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 6





# మడత 'ఖాజా'... దాగుడు మూతలాటా..!

2 లో...

- సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో రెండు దశాబ్దాలను తిష్ట వేసిన ఉద్యోగి..
- కార్మిక సంక్షేమానికి కొర్రీలు పెడుతున్న ప్రబుద్ధుడు !
- మాట్లాడడు.. కానీ మామూలు ఇస్తే కానీ ఫైలు కదలనివ్వడు..
- ఇతగాడి నిర్వాకానికి ఇబ్బందులు పడుతున్న కార్మికులు..

సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో తన పలుకుబడిని ఆయుధంగా మార్చుకొని రెండు దశాబ్దాలుగా ఒకే చోట తిష్టవేసి, కార్మికులను ముప్పుతిప్పలు పెడుతున్న ఓ సీనియర్ అసిస్టెంట్ కథనం ఇది. **ఆయనను కదిలించగల అధికారే సింగరేణి వ్యాప్తంగా లేదన్న మాట వినిపిస్తోంది.** కార్మిక సంక్షేమం కోసం ఉండాల్సిన విభాగాన్ని, కొర్రీలతో కదలనివ్వని గాడిదగా మార్చి, "మామూలు" రేటు లేకుండా ఫైలు కదలనివ్వడంలేదని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● కొత్తగూడెం సింగరేణి, ప్రజాజ్యోతి

## ఐఈడి బాంబు పేలి బాలుడికి గాయాలు



**చర్ల, అక్టోబర్ 10(ప్రజాజ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్ గఢ్ బీజాపూర్ జిల్లాలో గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పిడియా ప్రాంతంలో నక్సలైట్లు అమర్చిన ప్రెజర్ ఐఇడి బాంబు పేలి ఒక అమాయక గిరిజన బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం మధ్యాహ్నం గ్రామస్తులు తమ రోజువారీ పనుల్లో బిజీగా ఉన్నప్పుడు ఈ సంఘటన జరిగింది. ఈ ఆకస్మిక పేలుడుతో గ్రామంలోని వారు

మిగతా 2 లో...

- సింగరేణి విస్తరణకు అనుబంధంగా రెండు కొత్త సంస్థలు
- భవిష్యత్తు దిశలో కంపెనీకి నూతన పునాది
- రూపాంతరం దిశగా సంస్థ కొత్త అడుగు
- పునరుత్పత్తి శక్తి, గనుల విస్తరణకు సరికొత్త ప్రణాళిక
- ప్రపంచ స్థాయిలో అడుగులు, గ్రీన్ ఎనర్జీ వైపు వేగం
- రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో సింగరేణి కొత్త శిఖరాలు
- సింగరేణి సిఎండి విజన్‌కు ప్రశంసలు..









2 లో...

# కొత్త అనుబంధ సంస్థలతో.. సరికొత్త పునాది

## మానసిక ఆరోగ్యం పై అవగాహన



**కొత్తగూడెం సింగరేణి, ప్రజాజ్యోతి, అక్టోబర్ 10:** మనిషి మానసికంగా బలంగా ఉండాలని ప్రతీ చిన్న విషయానికి ఆందోళన చెందితే ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుందని సింగరేణి ఆసుపత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ విశ్వమేది అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సింగరేణి ప్రధాన ఆసుపత్రిలోనీ నర్సింగ్ కళాశాలలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజకుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మానసిక రుగ్మతలు, వాటి కారణాలు, లక్షణాలు, నివారణా మార్గాల గురించి ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య అధికారిణి డాక్టర్ లలిత, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ రేణుక, ఫ్యాకల్టీ లలిత లక్ష్మి , రెహానా, నాగహేమ తదితరులు పాల్గొన్నారు.

## ఐఈడి బాంబు పేలి బాలుడికి గాయాలు

(మొదటి పేజీ తరువాయి...)

భయాందోళనలకు గురిఅయ్యారు. ఈ సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే సి ఆర్ పీ ఎఫ్ 199, 85 బెటాలియన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు బాలుడికి ప్రథమ చికిత్స అందించిన తర్వాత గాయపడిన బాలుడిని బీజాపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల బృందం అతని పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ నక్సలైట్ చర్య స్థానిక గిరిజన సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. నక్సలైట్లు నిరంతరం అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఈ అమానవీయ హింస భరించలేనిదిగా మారిందని గ్రామస్తులు తెలిపారు. గత కొన్ని నెలలుగా జిల్లాలోని అంతర్భాగాలలో మావోయిస్టులు అమర్చిన ఐ ఈ డి పేలుళ్ల కారణంగా అనేక మంది పౌరులు మరణించారు. ఈ సంఘటన తర్వాత భద్రతా దళాలు ఆ ప్రాంతంలో మిగిలిన పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేయడానికి ఆ ప్రాంతాన్ని సురక్షితంగా ఉంచడానికి భద్రతా బలగాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి.

# దక్షిణ అయోధ్యకు "నూతన"శోభ



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 10, ప్రజాజ్యోతి:** దక్షిణ అయోధ్య భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకోనుందని ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, పనులు శరవేగంగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ తో పాటు ఆలయ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల వివిధ శాఖల అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు, ఇందులో భాగంగా భద్రాద్రి రామాలయం అభివృద్ధి పనుల్లో ముందుగా

**మాడ వీధుల విస్తరణకు దిశా నిర్దేశం చేస్తూ**

“ఆలయ విస్తరణ కోసం భూసేకరణ పూర్తయిందని, ప్రస్తుతం ఆలయం చుట్టూ ఉన్న మాడ వీధుల విస్తరణ పనులు, ప్రాకార గోడల నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని మంత్రి తుమ్మల కోరారు, ఆగమశాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ఫైనల్ చేసి ఆలయ రూపకల్పనను వేగవంతం చేయాలని సూచించారు.

**ఆగమశాస్త్రానికి అనుగుణంగా రూపకల్పన....**

ఆలయ నిర్మాణంలో ప్రతి అంశం ఆగమశాస్త్రం ప్రకారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. “భద్రాద్రి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, దీనిలో ఏ దశలోనూ నిర్లక్ష్యం ఉండరాదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

**భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం....**

భక్తులకు వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. భద్రాద్రి రామాలయం పునరుద్ధరణ పూర్తయిన తర్వాత దేశ వ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా ఉండాలని అన్నారు.

**అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ....**

ఆలయ అభివృద్ధి పనులు సమయపాలన ప్రకారం సాగుతున్నాయో లేదో నిరంతరంగా పర్యవేక్షించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ప్రతి దశ పనుల పురోగతిపై అధికారులు సమయానుకూల నివేదికలు సమర్పించాలని సూచించారు.భద్రాద్రి రామాలయం పునరుద్ధరణ పనులు పూర్తయిన వెంటనే అక్కడ విశాలమైన యజ్ఞశాల, రామకోట మాడ వీధులు, ఆధునిక కట్టడాలతో కొత్త చరిత్ర సృష్టించనున్నట్లు ఆయన తెలిపారు.

**రాష్ట్రంలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనం లక్ష్యం...**

రాష్ట్రంలోని ప్రాముఖ్యమైన దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడేలా దేవాదాయ శాఖ పనులు పారదర్శకంగా కొనసాగుతున్నాయని, భద్రాద్రి రామాలయం అభివృద్ధి ద్వారా తెలంగాణలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి నాంది పలుకుతుందని అన్నారు. ప్రభుత్వం భక్తుల నమ్మకాన్ని కాపాడే విధంగా దేవాదాయ శాఖను పారదర్శకంగా నడిపిస్తుందని, ఆలయాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుతూ అభివృద్ధిని సమతుల్యంగా కొనసాగిస్తాం” అని మంత్రి స్పష్టం చేశారు.

**ఖమ్మంలో టిటిడి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం**

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీని కోసం మూడు అనువైన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ టిటిడి అధికారులకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ నెల 14న సోమవారం టిటిడి అధికారులు ఖమ్మం నగరానికి వచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి ఆలయ స్థలాన్ని ఖరారు చేస్తారని మంత్రి తుమ్మల వెల్లడించారు. నూతన ఆలయం నిర్మాణం పూర్తయితే ఖమ్మం జిల్లాలో భక్తి, పర్యాటక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. తిరుమల తత్వం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో భక్తులకు మరింత దగ్గరగా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని తుమ్మల అన్నారు.

## కొత్త అనుబంధ సంస్థలతో.. సరికొత్త పునాది

- సింగరేణి విస్తరణకు అనుబంధంగా రెండు కొత్త సంస్థలు
- భవిష్యత్తు దిశలో కంపెనీకి నూతన పునాది
- రూపాంతరం దిశగా సంస్థ కొత్త అడుగు
- పునరుత్పత్తి శక్తి, గనుల విస్తరణకు సరికొత్త ప్రణాళిక
- ప్రపంచ స్థాయిలో అడుగులు, గ్రీన్ ఎనర్జీ వైపు వేగం
- రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో సింగరేణి కొత్త శిఖరాలు
- సింగరేణి సిఎండి విజన్‌కు ప్రశంసలు..




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, అక్టోబర్ 10 (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ అనుబంధంగా మరో రెండు సరికొత్త సంస్థలను ఏర్పాటు తన స్థానాన్ని ప్రపంచ స్థాయిలో బలమైన పునాదులతో నిలుపుకునేందుకు సిద్ధమయ్యింది. సాంప్రదాయ కోల్ మైనింగ్ తో పాటు కంపెనీ తన కార్యకలాపాలను ఇతర విభాగాలలో కూడా మరింత విస్తరించేందుకు మరో రెండు అనుబంధ సంస్థలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో ఈ ప్రతిపాదనలు తుదిదశకు చేరుకున్నట్టు సమాచారం. వాటిలో మొదటిది ‘సింగరేణి గ్లోబల్ కంపెనీ లిమిటెడ్’, రెండోది ‘సింగరేణి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్’. సింగరేణి గ్లోబల్ కంపెనీ ద్వారా సంస్థ విదేశీ స్థాయిలో విస్తరణకు పునాది వేస్తోంది. ఇప్పటి వరకు భారత్‌లో బంగారు గనులు, కీలక ఖనిజాల అన్వేషణలో అడుగులు వేసిన సింగరేణి, ఇప్పుడు ఆ అనుభవాన్ని అంతర్జాతీయ రంగంలో వినియోగించేందుకు సిద్ధమవుతోంది. బ్రెజిల్, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, టాంజానియా వంటి దేశాల్లో గనుల అన్వేషణ, తవ్వకాల ప్రణాళికలతో ముందుకు సాగనుందని సమాచారం. ఇదే సమయంలో “సింగరేణి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్” ద్వారా సంస్థ పునరుత్పాదక ఇంధన రంగంలో తన పట్టును బిగిస్తోంది. ఇప్పటి వరకు సింగరేణి ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, ఎనర్జీ స్టోరేజ్ యూనిట్లను విస్తృత స్థాయిలో నిర్వహించే బాధ్యత ఇకనుండి ఈ సంస్థదే అయ్యేటట్టు ముందుకు సాగుతుంది. దీంతో దేశంలో భవిష్యత్తులో కొత్త గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, హైబ్రిడ్ ఎనర్జీ ప్రణాళికలు కూడా ఈ సంస్థ పరిధిలో ఉండనున్నాయి. ఇప్పటికే ఈ రెండు సంస్థలకు సంబంధించిన షేర్ నిర్మాణం, డైరెక్టర్ల నియామకం, ఆర్థిక ప్రణాళిక అంశాలు తుదిదశకు చేరుకున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలుగా చర్చలు జరిపి ఈ నూతన కంపెనీ నిర్మాణ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. అయితే ఈ పరిణామాలతో సింగరేణి సంస్థ ఇకపై కేవలం బొగ్గు ఉత్పత్తి కంపెనీగానే కాకుండా, గ్లోబల్ మైనింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో సైతం బలమైన స్థానం సంపాదించుకునే దిశగా ముందుకు సాగుతోంది. ఈ పరిణామాలతో సింగరేణి సిఎండి ఎన్. బలరాం ఆధ్వర్యంలో సంస్థలో కొత్త చైతన్యం నెలకొన్నట్టు కార్మిక వర్గాలు, అధికారులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో, సంస్థ దృక్పథ మార్పుతో సింగరేణి భవిష్యత్తు దిశలో బలమైన అడుగులు వేస్తోందని దేశస్థాయి పరిశ్రమ వర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి.

## మడత ‘ఖాజా’... దాగుడుమూతలాటా!




**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 10, ప్రజాజ్యోతి :** సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో తన పలుకుబడిని ఆయుధంగా మార్చుకొని రెండు దశాబ్దాలుగా ఒకే చోట తిష్టవేసి, కార్మికులను ముప్పుతిప్పలు పెడుతున్న ఓ సీనియర్ అసిస్టెంట్ కథనం ఇది. ఆయనను కదిలించగల అధికారే సింగరేణి వ్యాప్తంగా లేడన్న మాట వినిపిస్తోంది. కార్మిక సంక్షేమం కోసం ఉండాల్సిన విభాగాన్ని, కొర్రీలతో కదలనివ్వని గాడిదగా మార్చి, “మామూలు” రేటు లేకుండా ఫైలు కదలనివ్వడంలేదని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రెండు దశాబ్దాలుగా..**

2005 జనవరిలో ప్రధాన ఆసుపత్రిలో జాయిన్ అయ్యి, 2015లో జూనియర్ అసిస్టెంట్ గా ప్రమోషన్ పొందిన ఈ మడతఖాజా — యూనియన్ నేతలతో సత్సంబంధాలు నెరుపుతూ, ఒకే చోట పదేళ్లకు పైగా ఉండటం అద్భుతమని సహోద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. స్వర్ భయం లేకుండా కుర్చీని అంటిపెట్టుకొని ఉండడమే కాకుండా, సంక్షేమం కోసం దరఖాస్తు చేసిన ఉద్యోగులను “ఫైలు లేదు... కాగితం మిస్సయ్యింది” అంటూ గాలిలో తిప్పేస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**“మాట్లాడడు... కానీ మామూలు లేకుండా ఫైలు కదలదు”**

రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎల్ సీ, ఎల్ ఎల్ డీసీ, సీఎంపీఎఫ్ రుణాల వంటి దరఖాస్తులు ఈ జూనియర్ అసిస్టెంట్ టేబుల్ మీదే నెలల తరబడి ఆగిపోతున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే “మీ పేపర్ ఫైలులో లేదు...” అంటూ నిర్లక్ష్యంగా సమాధానం. కానీ కొందరు ఉద్యోగులు “మామూలు” విషయాన్ని ప్రస్తావించగానే.. అదే ఫైలు ఆగమేఘాల మీద క్లియర్ అవుతోందన్నది అందరికీ తెలిసిన రహస్యమని చెబుతున్నారు.

**కార్మికులకు ముప్పుతిప్పలు..**

తమ సొంత సహోద్యోగి చేతిలో ఇంత అవమానం అనుభవిస్తున్నామని, నెలల తరబడి రుణాలు, బెనిఫిట్స్ కోసం తిరుగుతున్నామని ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు. సంక్షేమ విభాగంలో కూర్చొని, అదే సంక్షేమాన్ని అడ్డుకునే ఈ అసిస్టెంట్ పై యాజమాన్యం ఇప్పటికీ కళ్ళు మూసుకుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో “ఫైలు కదలాలంటే మామూలే మార్గమా?” అనే ప్రశ్న సింగరేణి కార్మిక వర్గంలో పెద్ద చర్చనీయాంశమైంది.

# గిరిజన హాస్టల్ కార్మికుల వేతనాలు పెంచాలి

- ఆశ్రమ పాఠశాలల డైలీ వేజెస్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి
- జీవో 64ను వెంటనే రద్దు చేయాలి
- తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి ప్రశాంత్ డిమాండ్



**టేకులపల్లి,అక్టోబర్10,ప్రజాజ్యోతి:** గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్,కాంటిని జెంట్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని,కార్మికులకు వేతనాలు తక్షణమే పెంచాలని,జీవో 64 ను రద్దు చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి ప్రశాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు సేవలు అంది స్తున్న డైలీ వేజెస్ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి గత 29రోజులుగా చేస్తున్న సమ్మెను విరమింప చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆశ్రమ ఉన్నత పాఠశాల గంగారంలోని సమ్మె శిబిరాన్ని తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎట్టి ప్రసాద్ శుక్రవారం సందర్శించి సంఘీభావాన్ని,మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఆశ్రమ పాఠశాలలలో గత 30 సంవత్సరాలుగా అరకొర జీతాలతో పని చేస్తూ గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు సకాలంలో అన్ని సేవలు అందిస్తూ,పాఠశాలలు సజావుగా నడవడానికి నిరంతరం సేవలు అందిస్తున్న డైలీ వేజెస్ వర్కర్లను ఔట్సోర్సింగ్ వర్కర్లుగా మారుస్తూ వారి వేతనాన్ని తగ్గించడం సరైనది కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే ఔట్సోర్సింగ్ వర్కర్లుగా మారుస్తూ జారీ చేసిన జీ.ఓ.64ను వెనక్కి తీసుకొని గతంలో మాదిరిగా వారికి ఇస్తున్న వేతనాలను చెల్లించాలని అన్నారు.హెల్త్ కార్డులు జారీ చేయాలని, మరణించిన వర్కర్ల కుటుంబంలో ఒకరికి డైలీ వేజెస్ వర్కర్ గా ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.25లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని,10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.సెప్టెంబర్ 12 నుండి ప్రారంభం అయిన నిరవధిక సమ్మె లో 29రోజులుగా ఎం.ద్వాలీ, ఈ.సీతమ్మ,బిజ్జ.లక్ష్మయ్య, కోరం. సమ్మక్క,కంగల.సరిత, జోగ. ముత్తమ్మ లు పాల్గొంటున్నారు.

## కార్మికుల ఆవేదన అర్థం చేసుకొని వేతనాలు వచ్చేలా చూడండి

- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న



**పినపాక, అక్టోబర్ 10(ప్రజాజ్యోతి ):** ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం వర్కర్లు పడుతున్న బాధను అర్థం చేసుకోవాలని , వారికి జీతాలు వచ్చేలా చూడాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న కోరారు. శుక్రవారం పినపాక మండలం ఐలాపురం వద్ద ఆశ్రమ పాఠశాల తనిఖీకి వచ్చిన తాసిల్దార్ గోపాలకృష్ణ, ఎంపీ ఓ వెంకటేశ్వరరావును కలిసి ఆశ్రమ పాఠశాల వర్కర్ల సమస్యలను విన్నవించారు. 11 నెలలుగా జీతాలు రాక వాళ్ళు ఇబ్బందులు పడుతున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు రమేష్, పాల్గొన్నారు.

## వనవాసి పరిషత్ కి ఇన్వర్టర్ వితరణ



**చర్ల, అక్టోబర్ 10 ( ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం వనవాసీ వసతి గృహంలోని ఇన్వర్టర్ బ్యాటరీ మరమ్మత్తుకు గురికావడంతో ఇర్ప వసంత్ రూ. 13.వేలతో నూతన ఎమరాన్ ఇన్వర్టర్ బ్యాటరీను వితరణగా అందచేసారు. శుక్రవారం విద్యార్థి నిలయంలో జరిగిన కార్యక్రమంలో బివిఎస్ఎల్ఎన్ మాట్లాడుతూ ఆదివాసీ రైతు తమ తోటి ఆదివాసీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని వితరణ అందచేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇటువంటి ప్రోత్సాహకాలను మరిన్ని అందించి విద్యార్థుల జీవితంలో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి సేవాభావం కలిగి ఉన్న వారని స్ఫూర్తిగా తీసుకుని పేద విద్యార్థుల చదువులకు వెన్నుదన్నుగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యార్ది నిలయ కమిటీ అధ్యక్షుడు తాటి పాపారావు మాట్లాడుతూ వసంత్ అందించిన సహకారానికి తోటి ఆదివాసీగా గర్విస్తున్నానని పేర్కొన్నారు. విద్య ఉంటే భవిష్యత్ ఉంటుందని, తాము కష్టపడి చదవడం వలనే నేడు ఉన్నత స్దితికి చేరుకున్నామని వెల్లడించారు. తమ లాంటి వారిని ఆదర్శంగా తీసుకొని క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్దితికి చేరుకోవాలని విజ్ఞప్తి చేసారు. ప్రతి విద్యార్ది భవిష్యత్ కొరకు తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్న విషయం గమనించాలని వారి శ్రమను వృదా చేయకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొమరం భీం విద్యార్ది నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, కమిటి సభ్యులు శివరాజు కిషోర్, లవన్ కుమార్ రెడ్డి, బుర్రా సత్యనారాయణ మూర్తి, యాదాల సందీప్, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

## బీసీ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం



**బూర్గంపహాడ్,అక్టోబర్10 (ప్రజా జ్యోతి):** బీసీ రిజర్వేషన్ పై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేసి, సారపాక జాతీయ రహదారి పై నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా బీసి సంఘం జిల్లా అధ్యక్షులు మహంకాళి రామారావు మాట్లాడుతూ హైకోర్టు స్టే వలన ఎన్నికల ప్రక్రియ నాలుగు వారాలు పాటు ఆపడం అనేది దురదృష్టకరమని అన్నారు.ఈ నిర్ణయం రాష్ట్రంలోని 56% బీసీ ప్రజల హక్కులను విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని నూటి కాడ అన్నం ముద్దను లాక్కున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుండా ఎన్నికలకు వెళితే తగిన గుణపాఠం తెలియచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, కార్యదర్శి బెజ్జంకి కనకాచారి, పినపాక నియోజవర్గం ఇంచార్జ్ నిదానపల్లి బాలకృష్ణ, మండల ఉపాధ్యక్షులు చిప్ప రాజు, విద్యార్థి సంఘ అధ్యక్షులు జమ్మి సాయిరాం,పిడుగు వంశీ, వెంకటేశ్వర్లు, బిసి నాయకులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థినీలకు సన్మానం

- సన్మానించిన శ్రీ వశిష్ట విద్యాసంస్థల యాజమాన్యం





**బూర్గంపహాడ్,అక్టోబర్10,(ప్రజా జ్యోతి ):** ఇటీవల నీట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్ సీటును సాధించిన బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామానికి చెందిన పునుగుపాటి రాంబాబు–స్రవంతి దంపతుల కుమార్తె పునుగుపాటి మనస్విని కామారెడ్డి లో ఫ్రీ సీటు సాధించగా , అదే గ్రామానికి చెందిన యారం చంద్రపూర్ణారెడ్డి వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె శ్రావణి నల్గొండలో ఫ్రీ ఎంబిబిఎస్ సీటు సాధించగా శ్రీ వశిష్ట, విద్యాసంస్థల యాజమాన్యం జిల్లా బాధ్యులు, ఏజీఎం ఉపేందర్ రావు, ప్రిన్సిపాల్ నవేంద్ర కుమార్ శుక్రవారం ఘనంగా శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంబిబిఎస్ గవర్నమెంట్ సీట్ సాధించిన పునుగుపాటి మనస్విని, యారం శ్రావణి మాట్లాడుతూ మనకు స్పష్టమైన లక్ష్యం అనేది ఉంటే ఎంత కష్టమైనా సాధించవచ్చు అని ప్రతి విద్యార్థినీ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలని గుర్తించి కష్టపడి చదువుకోవాలన్నారు.శ్రీ వశిష్ట కాలేజీ ఏజీఎం ఉపేందర్ రావు మాట్లాడుతూ సారపాకలో ఒక సాధారణ కుటుంబానికి చెందిన విద్యార్థినీలు, గవర్నమెంట్, ప్రయివేట్, సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ వరకు చదువుకొని హైదరాబాదులోని శ్రీ వశిష్ట కాలేజీలో కోచింగ్ తీసుకొని నీట్ లో ఉత్తీర్ణత సాధించడం నిజంగా హర్షించదగ్గ విషయమని ఇంతకు ముందు ఇదే పినపాక నియోజవర్గానికి చెందిన బుర్రుగడ్డ జగదీష్ శ్రీ వశిష్టలోనే కోచింగ్ తీసుకొని గవర్నమెంట్ సాధించాడని, ముందుగా వారి తల్లిదండ్రులకు అభినందిస్తూ రానున్న రోజుల్లో మరిన్ని ఉత్తమ ఫలితాలు శ్రీ వశిష్ట కాలేజీ నుండి సాధించాలని విద్యార్థినీ విద్యార్థులను ఆకాంక్షించారు. పిల్లలు అద్భుత విజయాలను సాధించినప్పుడు తల్లిదండ్రులు సంతోషిస్తారని శ్రీ వశిష్ట ఏజీయమ్ ఉపేందర్ రావు, ప్రిన్సిపల్ నవేంద్ర కుమార్ తెలిపారు.

## ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్







**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 10, ప్రజా జ్యోతి:** స్థానిక ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందన్నారు, ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్ , ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం



**చర్ల, అక్టోబర్ 10(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం ఎం.బీ.బీ.ఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని గోరింట్ల ధన్యశ్రీ. తండ్రి గోరింట్ల వెంకటేశ్వర రావు.పేద విద్యార్థినికి పది వేల రూపాయలు ఆర్థిక సాయం చర్ల మండల విద్యుత్ శాఖ ఏ.డి.ఈ.ప్రభాకర్ రావు చేతుల మీదుగా అందించారు . ఈ సందర్భంగా గోరంట్ల వెంకటేశ్వరరావు ప్రభాకర్ రావు కి ధన్యవాదాలు తెలిపారు ప్రభాకర్ రావు మాట్లాడుతూ లక్ష్యం అనేది ఉంటే అది ఎప్పటికైనా ఎంత కష్టమైనా సాధించవచ్చు ఆని ధన్య శ్రీ ని చూసి నేర్చుకోవచ్చని చెప్పా రు.తమ కుమార్తె కోసం ఎన్నో వ్యయ ప్రయాసలను ఎదుర్కొన్న అతని తల్లిదండ్రులను ప్రభాకర్ రావు అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు .

## విలేఖరి శ్రీనివాస చారిని పరామర్శించిన బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రమణారెడ్డి



**బూర్గంపహాడ్,అక్టోబర్10, ( ప్రజాజ్యోతి ) :** ఇ టీవ ల రోడ్డు ప్రమాదంలో గాయాలుపాలయ్యి విశ్రాంతి తీసుకుంటున్న విలేఖరి శ్రీనివాస చారిని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపి రెడ్డి రమణారెడ్డి బూర్గంపహాడ్ లోని ఆయన నివాసానికి వెళ్లి శుక్రవారం పరామర్శించారు.అనంతరం ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీరామ చంద్ర ఆశీస్సులతో త్వరగా కోలుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# బీసీలను మోసం చేసిన ప్రభుత్వం



**ఇల్లందు, అక్టోబర్ 10, ప్రజాజ్యోతి:** 42 శాతం రిజర్వేషన్ తో రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్, బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగల రాజేందర్ ఆరోపించారు. శుక్రవారం దిండిగల రాజేందర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్ లో చేర్చి తమిళనాడు తరహాలో చట్టం చేస్తే తప్ప బీసీ రిజర్వేషన్ సాధ్యం కాదని తెలిసి కూడా బీసీ రిజర్వేషన్ పై డ్రామాలు చేసి, హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలను వంచన చేస్తుందని విమర్శించారు. 60 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోని పార్టీ ఇప్పుడు బీసీల మీద మొసలి కన్నీరు కారుస్తుందని ఆరోపించారు. ఎన్నికలు ఎలాగైనా నిర్వహిస్తామని, అవసరమైతే పార్టీ పరంగా రిజర్వేషన్ తో ముందుకు వెళతామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడెందుకు వెనకకు తగ్గారో చెప్పాలని ప్రశ్నించారు. వానకాల సమావేశాల లో పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం బీసీల గురించి ఒక్క మాట కూడా మాట్లాడక పోవటం వారి చిత్త శుద్ధిని తెలియజేస్తుందని పేర్కొన్నారు. రిజర్వేషన్ అమలుకోసంకాంగ్రెస్ పార్టీ నాయకత్వం కానీ, ముఖ్యమంత్రి కానీ ప్రధాన మంత్రిని కనీసం కలిసి మాట్లాడని వారు బీసీ రిజర్వేషన్ తెస్తామని చెప్పడం దయ్యాలు వేదాలు వర్ణించినట్లు ఉందని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకొని ప్రజా ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదాలు వేస్తూ కాలం వెళ్ళబుచ్చడానికి బీసీ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. అఖిల పక్షం ద్వారా కేంద్ర ప్రభుత్వ మంత్రులను ప్రధానిని కలుద్దామన్న బిఆర్ఎస్ సూచనలను పక్కన పెట్టి కేవలం ప్రచారం కోసం మాత్రమే బిసి రిజర్వేషన్ ను వాడుకుంటున్నారని తెలిపారు. హై కోర్ట్ మొట్టికాయలు వేసేదాకా ఎన్నికల హూడావిడి చేసి ఎన్నికలు వాయిదా వేయగానే సంబర పడుతున్న కాంగ్రెస్ నాయకుల చిత్తశుద్ధిని బిసి కులాలు గమనిస్తూనే ఉన్నాయని, బీజేపీ నాయకులు కూడా చట్టం చేసే అధికారం ఉన్న స్వయంగా ప్రధాని బిసి కులానికి చెందినవాడై ఉన్నబీసీలకు న్యాయం చేయలేని పార్టీ ఇక్కడ బీసీల పట్ల సానుభూతి తెలపటం కేవలం రాజకీయాల కోసమేనని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్. రంగనాథ్, అబ్దుల్ నబీ,మహమ్మద్ జబ్బార్, లలిత్ కుమార్ పాసి, కడకంచి వీరస్వామి, పరికపల్లి రవి, మునిగంటి శివ పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యేకోరం



**టేకులపల్లి,అక్టోబర్10,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని దుబ్బ తండ గ్రామానికి చెందిన బోడ సురేష్ శుక్రవారం అనారోగ్యం కారణంతో మరణించడం వలన ఎమ్మెల్యే కోరం కనకయ్య వారి నివాసానికి వెళ్లి భౌతికదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఇటీవల కాలంలో దుబ్బ తండ గ్రామంలో మరణించిన వారి కుటుంబలను ఎమ్మెల్యే కోరం పరామర్శించి,వారి చిత్ర పటాలకు పూలమాల వేసి, నివాళులర్పించి కుటుంబ సభ్యుల మనోధైర్యాన్ని ఇచ్చారు.అబ్బిరెడ్డి గూడెం గ్రామం నందు బేతంపూడి మాజీ సర్పంచ్ ఎదలపల్లి బాబు తండ్రి కన్నయ్య అనారోగ్యంతో మృతిచెందాగా ఆయన పార్థివ దేహానికి ఎమ్మెల్యే పూల నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, పిఎసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్,మండల నాయకులు ఇది గణేష్, రెడ్యా నాయక్,మురళీ,ఎం.సుధాకర్, రమేష్,గోవర్ధన్, వెంకటి, విజయ్,భూక్యాసర్దార్, హనుమంతు,జింకల రాజు, రవి,శ్యామ్,సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

## జూలూరుపాడుసర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన డి.ఎస్.పి.

- వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు పరిశీలన.



**జూలూరుపాడు, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సర్కిల్ కార్యాలయాన్ని కొత్తగూడెం డి.ఎస్.పి అబ్దుల్ రహమాన్ శుక్రవారం సందర్శించారు. సందర్భంగా ఆయన సర్కిల్ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు డి.ఎస్.పి మాట్లాడుతూ సంవత్సరంలో ఒక సారి సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తామని కేసులకు సంబంధించి పురోగతి. సిబ్బంది విధులు విధానాలు ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ప్రభుత్వ బిల్డింగులకు సంబంధించి ,పెండింగ్లో ఉన్న కేసులు వాటి పురోగతి కోర్టు కేసులు పురోగతులపై చర్చిస్తామని అందులో భాగంగానే రికార్డులను పరిశీలించినట్లు రికార్డులపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ లక్ష్మీ తో పాటు జూలూరుపాడు ఎస్సై బాధావత్ రవి చంద్రుగొండ ఎస్సై శివరామకృష్ణ అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్ హాజరయ్యారు.

## గాంధీనగరంలో చోరీ

**చర్ల, అక్టోబర్ 10(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం గాంధీనగరం గ్రామానికి చెందిన కోడి రెక్కల భాస్కరరావు బుధవారం భద్రాచలం ప్రభుత్వ హాస్పిటల్లో కోడలు డెలివరీ అయితే చూడటానికి వెళ్లడం జరిగింది. ఇదే అదునుగా భావించిన దుండగులు పక్క ప్లాన్ ప్రకారం బుధవారం రాత్రి చోరీకి పాల్పడి 80000 రూపాయల నగదు 12 లక్షల రూపాయల విలువ చేసే బంగారు ఆభరణాలు దుండగులు దోచుకెళ్లినట్లు ఇంటి యజమాని తెలిపారు.వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సిఐ రాజీవర్మ ఎస్ఐ నర్సిరెడ్డి ఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని ఘటం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి క్లూస్ టీం ఘటన జరిగిన ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు .ఈ సందర్భగా చర్ల సి ఐ రాజు వర్మ మాట్లాడుతూ చోరీకి పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని ఎవరైనా దూర ప్రాంతాలకు వెళ్లే ముందు పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని విలువైన వస్తువులను మీతో పాటు తీసుకువెళ్లాలని చర్ల సి ఐ. రాజు వర్మ తెలియచేసారు.





## కాజీపేట ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలి

- తిరుపతికి స్పెషల్ ట్రైన్ ఏర్పాటు చేయండి
- భద్రాచలం దేవదర్శనానికి విచ్చేసిన సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణయ్య
- పలు సమస్యలపై వినతి పత్రం అందించిన డిఆర్యుసిసి మెంబర్ శ్రీనివాస్ రెడ్డి



**కొత్తగూడెం,అక్టోబర్ 10(ప్రజాజ్యోతి):** భద్రాచలం దైవదర్శననికి కొత్తగూడెం రైల్వే స్టేషన్ కు శుక్రవారం స్పెషల్ ట్రైన్ లో వచ్చిన సికింద్రాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాల కృష్ణయ్యని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు డిఆర్యుసిసి మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డి కలిసి కొత్తగూడెం ప్రాంత రైల్వే సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు.దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం రోడ్డు కొత్తగూడెం నుండి కలియుగ దైవంగా వెరసెలుతున్న తిరుపతి పుణ్యక్షేత్రానికి స్పెషల్ ట్రైన్ రైల్వే అధికారులు ఇచ్చిన హామీ మేరకు వెంటనే నడిపించాలని, కరోనాలో రద్దు చేసిన డోర్నకల్ కాజీపేట ప్యాసింజర్ రైలును తక్షణం పునరుద్ధరణ చేసిన నడిపించాలని కోరారు.కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనులు గత అనేక సంవత్సరాలు నుండి నత్త నడక నడుస్తున్నాయని తక్షణం నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు వెయిటింగ్ హాల్స్, వాష్‌రూమ్స్, ఎస్కలేటర్ అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సింగరేణి ట్రైన్ కు గతంలో లాగా బోగీలతొనడపాలని, సూపర్ ఫాస్ట్ ట్రైన్ కు, కాకతీయ ట్రైన్ కు అదనంగా రెండు ఏసీ బోగీలు మరియు మరో రెండు స్లీపర్ కోచ్ భోగిలు ఏర్పాటు చేయాలని కోరారు.డోర్నకల్ టు కొత్తగూడెం వరకు డబల్ రైల్వే లైన్ త్వరగా చేయాలని, అదేవిధంగా అటుకోవూరు రైల్వే లైన్ పనులు ఎటువైపు భద్రాచలం మీదుగా చత్తీస్గడ్ టు కిరణ్ డోల్ వరకు రైల్వే లైను ఏర్పాటు చేసి కొత్తగూడెం రైల్వే జంక్షన్ గా ఏర్పాటు చేయాలని తద్వారా కొత్తగూడెం ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.కొత్తగూడెం నడిబొడ్డున ఉన్న ప్రగతి మైదాన్, రాజీవ్ పార్కు ఎన్జీవోస్ కాలనీలకు మరియు వాకర్స్ కు రైల్వే ట్రాక్ పై గత అనేక సంవత్సరాలుగా ఉన్న దారిని తిరిగి పునరుద్ధరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం రోడ్ రైల్వే ఏరియా ఆఫీసర్, రైల్వే పోలీస్ అధికారులు, రైల్వే ఇన్స్పెక్టర్, స్టేషన్ మేనేజర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## దమ్మపేట మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె

- నూతనంగా ప్రారంభించిన శ్రీ గాయత్రి హాస్పిటల్ మెరుగైన వైద్యం అందించి పేదలకు అండగా నిలవాలి ఎమ్మెల్యే జారె







**దమ్మపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి ):** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ శుక్రవారం దమ్మపేట మండల కేంద్రంలో పర్యటించారు. ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో కలిసి ఉదయపు ప్రార్థనలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. తరువాత సత్తుపల్లి ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ సురేష్ రామాల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయబడిన శ్రీ గాయత్రి హాస్పిటల్ ను ముఖ్య అతిథిగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, ఆసుపత్రి యాజమాన్యం మెరుగైన వైద్యం అందించి పేద ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం – ప్రజల హక్కుల పరిరక్షణకు శక్తివంతమైన సాధనం

- అన్ని శాఖల సమగ్ర సమాచారం ఆన్లైన్లో పొందుపరచాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 10, ప్రజా జ్యోతి:** ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన పెంపొందించుకుని, దాని ద్వారా ప్రభుత్వ కార్యకలాపాలపై సమాచారం పొందడమే కాకుండా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వామ్యులవ్వాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపు నిచ్చారు.సమాచార హక్కు చట్టం 2005 అమలులోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు జిల్లా కలెక్టర్ డి వేణుగోపాల్ లు పాల్గొని ట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు శక్తి నిచ్చే చట్టం అని అన్నారు. ఇది ప్రభుత్వ పారదర్శకతను పెంపొందించి, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని నెలకొల్పుతోందని తెలిపారు . ప్రజలు కోరిన సమాచారం సకాలంలో అందించడం ద్వారా పరిపాలనా విశ్వసనీయత మరింతగా పెరుగుతుందని ,ప్రతి శాఖ అధికారులు ఈ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు సేవ చేయాలన్నారు, అన్ని శాఖల అధికారులు తమ శాఖల వారీగా నిర్వహిస్తున్న కార్యకలాపాలు, సేవలు, నిర్ణయాలు, సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఆన్లైన్లో జిల్లా అధికారిక వెబ్ సైట్ నందు పొందుపరిచే విధంగా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు సమాచారం కోసం దరఖాస్తు చేసుకునే ముందు, వారు కోరిన సమాచారం ఇప్పటికే అందుబాటులో ఉండేలా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు ,ప్రతి కార్యాలయంలో పీఐఓ, ఎపీఐఓ, అప్పీలేట్ అథారిటీ నియమించి, ఆర్టీఐ దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని, ప్రజల దరఖాస్తులపై సానుకూల దృక్పథంతో స్పందిస్తూ అవసరమైన మార్గదర్శకతతో సహా పూర్తి సమాచారం అందించాలని, సమాచారాన్ని నిరాకరించినప్పుడు దానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలి అని సూచించారు. అన్ని శాఖల అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని దానికి అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అధికారులు ,సిబ్బంది తో సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ ప్రజల విజ్ఞప్తులకు సకాలంలో స్పందించడం, స్వచ్ఛందంగా ఇవ్వవలసిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉండాలంటూ ప్రతిజ్ఞ చేయించారు, ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, డి సి ఓ రుక్మిణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, భూగర్భ జల శాఖాధికారి రమేష్,అన్ని శాఖల జిల్లా అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన ఫారెస్ట్ డిపార్ట్మెంట్ జోనల్ స్పోర్ట్స్

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ భీమనాయక్
- క్రీడలతో శారీరక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి, స్నేహభావం పెంపొందుతాయి: భీమ నాయక్
- ఐదు జిల్లాల ఫారెస్ట్ జట్ల మధ్య కొనసాగుతున్న క్రీడలు








**కొత్తగూడెం,అక్టోబర్ 10(ప్రజాజ్యోతి ):** కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శుక్రవారం ఫారెస్ట్ డిపార్ట్మెంట్ జోనల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలు భద్రాద్రి జోన్ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలోని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మధ్య కొనసాగనన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. డి.భీమ నాయక్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, భద్రాద్రి సర్కిల్, వరంగల్ హాజరై క్రీడా సమ్మేళనాన్ని ప్రారంభించారు.అధికారులు క్రీడా ప్రమాణ స్వీకారంలో పాల్గొని క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు.క్రీడాల ఆరంభంలో డా. డి. భీమ నాయక్ మరియు ఇతర జిల్లా అటవీ అధికారులు కలిసి ఓపెనింగ్ మ్యాచ్ ఆడుతూ క్రీడా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.భద్రాద్రి సర్కిల్ పరిధిలోని వివిధ విభాగాల నుండి పాల్గొన్న అటవీ అధికారులు మరియు సిబ్బంది వివిధ క్రీడా విభాగాల్లో తమ ప్రతిభను కనబరిచారు.ఈ క్రీడల ద్వారా ఎంపికైన ప్రతిభావంతులు రాష్ట్ర స్థాయి క్రీడా సమ్మేళనంలో పాల్గొనను న్నారు, అక్టోబర్ 17 నుండి 18 వరకు దుల్లపల్లి, హైదరాబాదులో జరగనుంది.తదుపరి దశలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడా సమ్మేళనం లో పాల్గొననున్నారు, ఇది డెహ్రాడూన్లో నిర్వహించబడనుంది.అటవీ శాఖ సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి, స్నేహభావం మరియు జట్టు సహకారాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం అని చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డి. భీమనాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఐఎఫ్ఎస్సి జి. కృష్ణ గౌడ్, ఖమ్మం ఐఎఫ్ఎస్ సిద్ధార్థ విక్రం సింగ్, మహబూబాద్ ఐఎఫ్ఎస్సి బత్తుల విశాల్, హనుమకొండ ఐఎఫ్ఎస్సి బి లావణ్య, వరంగల్ ఐఎఫ్ఎస్సి అనుజే, వరంగల్ డీసీఎఫ్ కృష్ణమాచారి, పాల్వంచ డిసిఎఫ్ దామోదర్ రెడ్డి, కిన్నెరసాని డిసిఎఫ్ బి బాబు, భద్రాచలం ఏసిఎఫ్ ఎస్ సుజాత, మణుగూరు ఏసిఎఫ్ సయ్యద్ మాకసూద్ మోహిద్దీన్,మహబూబాబాద్ ఏసిఎఫ్ ఎఫ్డిఓ ఏ వెంకటేశ్వరరావు, గూడుర్ ఏసిఎఫ్ చంద్రశేఖర్, సత్తుపల్లి ఏసిఎఫ్ మంజుల, కొత్తగూడెం ఏసిఎఫ్ యు కోటేశ్వరరావు, ఇల్లెందు ఏసిఎఫ్ కరుణాకర చారి తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా బైక్ నడిపిన విద్యార్థిపై కేసు నమోదు

**దమ్మపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి ):** దమ్మపేట మండలం,అచ్చుతాపురం ఎక్స్ రోడ్డు వద్ద మోటార్ సైకిల్ ను నిర్లక్ష్యంగా నడిపిన విద్యార్థిపై దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బ్లూ కోల్ట్ విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ బి. బాలకృష్ణ , హోంగార్డ్ 913తో కలిసి పహారా నిర్వహిస్తుండగా, కుంజా చందు, తండ్రి పేరు ప్రసాద్, దురదపాడు గ్రామనికి చెందన వ్యక్తి నడుపుతున్న మోటార్ సైకిల్ ను ఆపి పరిశీలించగా, అతడు ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించి, నిర్లక్ష్యంగా వాహనం నడపడం తోపాటు, సైరన్ ఉపయోగించడం ద్వారా ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగించినట్లు తేలింది. ఈ సందర్భంగా పోలీసులు మోటారు వెహికల్ యాక్ట్ ప్రకారం అతని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.నిర్లక్షంగా వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణం అయిన వారిని ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా దమ్మపేట ఎస్ ఐ సాయి కిశోర్ రెడ్డి హెచ్చరించారు.

# చైన్ స్నాచ దొంగలు, సైబర్ క్రైమ్స్ గురించి మహిళలకు దిశ నిర్దేశం చేసిన ఎస్ ఐ ఎం మనీషా




**కొత్తగూడెం మున్సిపాలిటీ, రామవరం, అక్టోబర్ 10, ప్రజా జ్యోతి:** కొత్తగూడెం పట్టణం రామవరం ఏరియా మరియు పరిసర ప్రాంతాల్లో దొంగల సంచార ఎక్కువగా వుందీ అని మహిళలు ఉదయాన ముగ్గులకు, పాల కోసం వెళ్లే తరుణం లో చైనస్నాచర్లు మెడలో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలిస్తున్నారు అని, మరియు మీ చర వాని లకు ( ఫోన్ ) కాల్ చేసి ఓ టీ పి., లింకులు క్లిక్ చేయమని అంటే చేయరాదు మరియు మీ చుట్టూ ప్రక్కల డ్రగ్స్ ఏ వారైనా వాడిన అమ్మిన పోలీస్ వారికి అట్టి వారిపై సమాచారం అందించాలి అని 2వ పట్టణ స్ ఐ., ఎం మనీషా ప్రజలకు వివరించారు.

# సమయానికి ముందే ఇంటి బాట

- మూడింటికి ఇంటి దారి పట్టిన హెచ్ఎం





**టేకులపల్లి,అక్టోబర్10, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ ఉపాధ్యాయులు తప్పనిసరిగా నాలుగు గంటల వరకు విధుల్లో ఉండాల్సిన నిబంధన ఉంది. కానీ మండలంలో సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఫేస్ రికగ్నిషన్ ద్వారా అటెండెన్స్ వేసి ఇంటికి వెళ్లాల్సిన హెచ్ఎం ముందస్తుగానే మూడు గంటలకే ఇంటి దారి పట్టిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. హత్తి రామ్ మూడు గంటలకే పాఠశాల నుంచి బయటకు వెళ్ళిపోవడం జరిగింది. ఈ నేపథ్యంలో విద్యార్థులను సమీప అంగన్వాడి ఆయాకు అప్పగించాడు. మరొక ఉపాధ్యాయుడు శుక్రవారం సెలవులో ఉన్నారు. దీంతో విద్యార్థులే పాఠశాల ఆవరణలో ఆడుకొని ఆ తర్వాత ఇంటికి వెళ్ళిపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా పలుమార్లు ప్రధానోపాధ్యాయుడికి హెచ్చరించినప్పటికీ ఆయన నిర్లక్ష్య ధోరణిలో ప్రవర్తిస్తున్నారన విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.ఈ విషయంపై పాఠశాల హెచ్ఎం వి. హతిరామ్ ను వివరణ కోరగా అమ్మ ఆదర్శ పాఠశాల బిల్లులకు సంబంధించి బ్యాంకుకు వెళ్లానని ప్రతిరోజు పాఠశాలకు సమయం ప్రకారమే వస్తున్నానని తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని తెలిపారు.

# బీసీ 42రిజర్వేషన్ కోసం నిరసన కార్యక్రమం



**ఆళ్ళపల్లి,అక్టోబర్10.ప్రజా జ్యోతి:** ఆళ్ళపల్లి మండలంలోని మర్కోడు గ్రామం బీసీ రిజర్వేషన్ పై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బిసి సామాజిక వర్గానికి సంబంధించిన గ్రామ పెద్దలు నాయకులు ఆవేదన వ్యక్తం చేసి, రహదారి పై నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులంతా స్వచ్ఛందంగా కిరణ షాపులు బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ హైకోర్టు స్టే వలన ఎన్నికల ప్రక్రియ నాలుగు వారాలు పాటు ఆపడం అనేది దురదృష్టకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో. పొందిలా. రాము.తాళ్లపల్లి వెంకన్న. యాసరపు బాబు. జనార్ధన్. సతీష్రవికుమార్. కనకాచారి,విగేంద్ర చారి. రాజు. శ్రీనివాస్. వెంకన్న.శ్రావణకుమార్. సద్గుణాచారి. హరీష్ నరేష్.కుద్రత్.వినయ్. కళ్యాణ్ రాము.ఆకాష్. నారాయణ. తదితరులు పాల్గొన్నారు.

## చదరంగంలో అద్భుతప్రతిభ

- సత్తా చాటిన భవ్య శ్రీలక్ష్మి
- రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపిక






**అశ్వారావుపేట, అక్టోబర్ 10, ప్రజా జ్యోతి :** చిన్నప్పటినుంచి ఏర్పడ్డ ఇష్టంతో చెస్ ఆడుతూ ఆటలో అద్భుత ప్రతిభ చూపిస్తూ భవ్య శ్రీ పథకాల మీద పతకాలు సాధిస్తుంది. అశ్వారావుపేటకు చెందిన కేసు బోయిన వీరాంజనేయులు, రమాదేవి దంపతుల కుమార్తె భవ్య శ్రీలక్ష్మి సత్తుపల్లి డి ఏ వి స్కూల్లో 9వ తరగతి చదువుతుంది. డి ఏ వి నేషనల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సఫలి గూడ డిఏవి స్కూల్ క్రీడామైదానంలో శుక్రవారం నిర్వహించిన చదరంగం పోటీలలో భవ్య శ్రీ లక్ష్మి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికైంది. తండ్రి ఆంజనేయులు ఓ పత్రికలో పాత్రికేయుడుగా పనిచేస్తుండగా తల్లి ఉద్యోగిగా విధులు నిర్వహిస్తుంది. చిన్నతనం నుండి చెస్ ఆడుతూ ఆటపై మక్కువతో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్న భవ్య శ్రీలక్ష్మి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు చిన్నారిని ప్రోత్సహించారు. వారు అందించిన ప్రోత్సాహంతో భవ్య శ్రీ నేడు అండర్ 17 విభాగంలో జాతీ య స్థాయికి ఎంపిక కావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. డి ఏ వి స్కూల్ ప్రిన్సిపల్ సాయి శ్రీ పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో మాట్లాడుతూ సుమారు 2వేల స్కూల్స్ ప్రతి సంవత్సరం ఈ ఆటలు నిర్వహిస్తాయని గతంలో మొదటిగా జోనల్ స్థాయిలో పాల్వంచలో నిర్వహించిన పోటీలలో 12 స్కూల్స్ పాల్గొనగా సత్తుపల్లి డిఏవి నుండి నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అయ్యారన్నారు. రాష్ట్రస్థాయిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుండి 20 స్కూల్స్ పాల్గొనగా సత్తుపల్లి డి ఏవి స్కూల్ నుండి ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఢిల్లీలో నవంబర్ లో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్న ఈ బృందానికి భవ్య శ్రీ లక్ష్మి కెప్టెన్‌గా వ్యవహరిస్తారన్నారు. జాతీయ స్థాయిలో ఎంపికైన భవ్య శ్రీ లక్ష్మి పుర ప్రముఖులు, పాత్రికేయులు, పలువురు అధికారులు అభినందిస్తున్నారు.

## పోస్టల్ శాఖ సామాజిక బాధ్యతలో మరో అడుగు

- కూలీ కుటుంబానికి 15 లక్షల బీమా సాయం




**దమ్మపేట, అక్టోబర్ 10 (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, నాచారం గ్రామానికి చెందిన తన్నీరు నాగమణి నాచారం పోస్టాఫీస్‌లో సంవత్సరానికి రూ.755 తో "నీవాబుబా ప్రమాద బీమా పాలసీ" పొందినట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. పాలసీ చేసిన ఆరు నెలల తరువాత ఆమె వరి పొలంలో పని చేస్తుండగా పాము కాటు వల్ల మృతి చెందింది. ఈ మరణానికి సంబంధించి అవసరమైన పత్రాలను నాచారం బ్రాంచ్ పోస్టుమాస్టర్ అమీదా భాను, నీవాబుబా ఇన్సూరెన్స్ కంపెనీకి పంపించగా, 15 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ క్లెయిమ్ మంజూరైంది. శుక్రవారం నాచారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీ వీరభద్ర స్వామి ,నామినీ తన్నీరు లక్ష్మయ్య (భర్త )కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగాఅధికారులు మాట్లాడుతూ "రోజుకు రెండు రూపాయలు, సంవత్సరానికి రూ.755తో ప్రమాద బీమా చేయించుకోండి. ప్రమాదం సంభవించినప్పుడు కుటుంబానికి ధీమా కల్పించే అద్భుత పథకం" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ శ్రీ రాజేష్ కుమార్, నీవాబుబా కంపెనీ మేనేజర్, పాల్వంచ మెయిల్ వర్సెల్ దుర్గాప్రసాద్, స్థానిక పోస్టుమాస్టర్, పోస్టల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పి. సంతోష్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# "గుర్తింపు"లో ఆధిపత్య పోరు?

- ఏఐటీయుసీలో అంతర్గత కుమ్ములాట?
- కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో వైఫల్యమా.?
- తాజా, మాజీల మధ్య ఆధిపత్య పోరు?
- నాయకుల వ్యక్తిగత ఆధిపత్యంతో కార్మికుల సమస్యలు గాలికి!
- కార్మికుల పట్ల వీరి వైఖరి ఏమిటో?
- అయోమయంలో కార్మికన్న
- తాను చెబితేనే పనులు చేయాలంటూ హుకుం?
- కార్మికుల్లో పలుచబడుతున్న పట్టింపు లేదా?
- పంతాలే ముఖ్యమా.. కార్మికుల సమస్యలు వద్దా!



**ఇల్లందు, అక్టోబర్ 10, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థలో ఆ యూనియన్ కు ఎంతో సుధీర్ఘ చరిత్ర ఉంది. ఎన్నో ఏళ్లుగా కార్మికుల హక్కులు సాధించిన ఘనత ఆ సంఘానిది. ఆ యూనియన్ లో ఎందరో త్యాగధనులు కార్మికుల కోసం వారి హక్కులు, సమస్యల పరిష్కారానికై ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసిన నైజం ఆ యూనియన్ కే దక్కిందనే చెప్పొచ్చు. కార్మిక శ్రేయస్సే లక్ష్యంగా పని చేసి కార్మికుల మదిలో చిరస్థాయిగా నిలిచిందనేది వాస్తవం. కానీ ప్రస్తుతం ఇల్లందులో తాజా, మా జీ కార్మిక నాయకత్వం విషయంలో ఆధిపత్య పోరు కార్మికుల సమస్యల పరిష్కార విషయంలో శాపంగా మారుతుందని కార్మికులు వాపోతున్నారు. ఏఐటీయుసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ లో అంతర్గత కుమ్ములాట తారస్థాయికి చేరిందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి విధి నిర్వహణలో ఉన్న కార్మికులకే నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తేనే వారి పక్షాన మాట్లాడే అవకాశం ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు. కానీ వాటికీ భిన్నంగా గత కొన్నేళ్లుగా పదవీ విరమణ పొందిన నాయకులు యూనియన్ లో కీలక బాధ్యతలు చేపడుతూ కాలం వెళ్లదీస్తున్నారనే ఆపవాదు లేకపోలేదు. ఈ క్రమంలో నూతనంగా యూనియన్ బాధ్యతలు చేపట్టిన నాయకులు పేరుకే నాయకులుగా మిగిలే పరిస్థితిని యూనియన్ బాధ్యతలు నిర్వహిస్తున్న మాజీ కార్మిక నాయకులు వ్యవహరిస్తున్నారనే బహిరంగ ఆరోపణలు ఉన్నాయి. ఇలా నేతల మధ్య ఆధిపత్య పోరు వల్ల కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారనే విమర్శలు కార్మికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. దింతో కార్మికుల సమస్యలు, హక్కుల సాధించడంలో పూర్తిగా విఫలం చెంది, వారి సమస్యలు, హక్కుల పక్షాన పోరాడే వారే ఆధిపత్య పోరులో కొట్టుమిట్టాడుతుంటే ఇక కార్మికన్న సమస్యలు గాలికి వదిలేసినట్లేనా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా కార్మికుల పట్ల వీరి వైఖరి ఏమిటో అర్థం కాక కార్మికులు తలలు పట్టుకుంటున్నారనేది వాస్తవం. కార్మికుల సమస్యల పరిష్కర విషయంలో ప్రస్తుత బాధ్యతలు నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు అధికారులతో చర్చలు జరుగుతున్న సమయంలో ప్రోటోకాల్ పాటించకుండా మాజీ నాయకులు సైతం సమావేశాల్లో పాల్గొని వీరి మాట చెల్లుబాటు కాకుండా అధికారులతో గతంలో ఉన్న సంబంధాలను దృష్టిలో ఉంచుకొని వీరి మాటే చెల్లుబాటు అయ్యే విధంగా వ్యవహరించడంతో తాజాగా నాయకత్వం వహిస్తున్న యూనియన్ నాయకులు వారి వ్యవహార శైలి పట్ల తీవ్ర అసంతృప్తి అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకానొక సందర్భంలో మీరు తీసుకున్న నిర్ణయాలను పరిష్కరించిన కార్మిక సమస్యలను సైతం అధికారులతో ఉన్న సత్సంబంధాలను అడ్డుపెట్టుకొని ఆ సమస్యలు పరిష్కారం కాకుండా అడ్డుపడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దీంతో యూనియన్ ను గత కొన్ని ఏళ్లుగా నమ్ముకొని ఉన్న కార్మికులకు తీవ్ర నష్టం కలుగుతుందని, ఈ రెండు వర్గాల తాజా, మాజీ ఆధిపత్య పోరు కార్మికుల సమస్యల పరిష్కారానికి శాపంగా మారుతుందనే విమర్శలు ఉన్నాయి. పేరుకే తాజాలు నాయకులుగా ఉంటారని, నిర్ణయాలు తమయేనంటూ సింగరేణి మాజీ కార్మికులుగా ఉండి యూనియన్ లో ప్రధాన పాత్ర పోషిస్తున్న వారు అధికారులకు అంతర్గతంగా సూచనలు చేస్తూ వారు తీసుకున్న వారు నిర్ణయించిన వారు తెలిపిన సమస్యలను వేటిని పరిష్కరించవద్దంటూ అధికారులకు సూచనలతో పాటు హెచ్చరించడంతో వారు సైతం వారి ఆధిపత్య పోరు మాకెందుకు అనుకోని కార్మిక సమస్యలను పరిష్కరించడంలో వెనుకడుగు వేస్తున్నారని కార్మికులు గుసగుసలాడుకుంటున్నారు. కానీ గతంలో నుంచి గుట్టుగా ఉన్న ఈ అంతర్గత ఆధిపత్య పోరు నేటికి కార్మికుల సమస్యలు పరిష్కరించే క్రమంలో కొద్దికొద్దిగా బహిర్గతం అవుతుందని పక్కా సమాచారం.

### కార్మికుల్లో పలుచన పడుతున్న పట్టింపు లేదా?

సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల సాధన కోసం ఎంతో చరిత్ర కలిగి ప్రస్తుతం సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న యూనియన్ లో అంతర్గత ఆధిపత్య పోరులో కార్మికుల సమస్యలు, హక్కులు సాధించడంలో అంతలా పోరాట పటిమ కొనసాగించడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. ఎదో కార్మికుల కోసం పోరాటం చేస్తున్నామనే ఆర్భాటం తప్ప మరొకటి లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఎంతో గణ చరిత్ర ఉన్న యూనియన్ లో ఎలాంటి పరిస్థితులు, ఆధిపత్య పోరు ఉండడం ఏమిటని కార్మికులు గుసగుసలాడుకుంటున్నారు. గతంలో ఎప్పుడు లేని విదంగా ప్రస్తుతం గుర్తింపు సంఘ వ్యవహారం ఏలా మారడం ఏమిటో కార్మికులకే అంతు చిక్కని ప్రశ్నగా మారింది.

### మాజీల వల్లనే సమస్యలు పరిష్కారం కావడం లేదా?

సాధారణంగా కార్మిక సంఘంలో ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న కార్మికుడికి నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే నేరుగా వారి సమస్యలు తెలుసుకోని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించడం జరుగుతుంది. కానీ ఆ యూనియన్ లో మాత్రం స్థానికంగా విధులు నిర్వహిస్తున్న కార్మికులకే బాధ్యతలు ఇచ్చినప్పటి, పై స్థాయిలో మాజీలైన వారే పూర్తి స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించడం గమనార్హం. ఒకవేళ ఇల్లందు ఏరియా స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తున్న వారు అధికారుల వద్దకు వెళ్లి వాటిని పరిష్కరించాలని అడుగుతుండగా, మాజీలుగా ఉంటూ పై స్థాయి బాధ్యతల్లో ఉన్న వారేమో మేము చెబితేనే వాటిని పరిష్కరించాలని పరోక్షంగా హుకుం జారీ చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. దింతో అధికారులు సైతం చేసేదేమి లేక మిన్నకుంటున్నట్లు సమాచారం.

### కార్మికుల్లో పలుచన పడుతున్న ఆ కార్మిక సంఘం?

నిత్యం సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడే ఆ కార్మిక సంఘం అంతర్గత ఆధిపత్య పోరు వల్ల సింగరేణి కార్మికుల్లో మరింత పలుచన పడుతుందని కార్మికులు బహిరంగంగా పేర్కొంటున్నారు. వారి యూనియన్ లో ఏమైనా అంతర్గత ఆధిపత్య పోరు ఉంటే ఉండొచ్చు ఏమో కానీ వా టిని కార్మికుల సమస్యలు, హక్కుల ప రిష్కారం కోసం ముడి పెట్టడం ఏమిట ని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం గా ఉన్న ఆ యూనియన్ కు ఆధిపత్య పంతమే ముఖ్యమా.. కార్మికుల సమస్యలు, హక్కులు వద్దా అనే విమర్శలు కార్మికుల నుండి వ్యక్తమవుతున్నాయి.

### ఇల్లందు భవిష్యత్ పై పట్టింపు లేదా?

సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా భవిష్యత్తు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఇటు జెకే 5 ఓసిలో బొగ్గు నిక్షేపాలు తగ్గుముఖం పట్టడంతో దాని కాలపరిమితి పూర్తయిన కానీ అధికారులు జెకే 5 ఓసిని కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే జెకే 5 ఓసి పొడగింపు ప్రాజెక్ట్ (పూసపల్లి ఓసి) అనుమతులు వచ్చాయని... మరికొన్ని అనుమతులు పెండింగ్ లో ఉన్నాయని చెబుతూ ఆ పనులు ముందుకు సాగడం లేదనేది వాస్తవం. ఇంతలా ఇల్లందు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో ప్రస్తుతం గుర్తింపు కార్మిక సంఘం ఎలాంటి పాత్ర పోషిస్తుందోనని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కేఓసి పిట్ 3 పనులను గతంలో ప్రైవేట్ సంస్థకు కేటాయించినప్పటికీ, ఆ సంస్థ పనులు ప్రారంభించకపోవడంతో దానిని నిలుపుదల చేశారు. ఇప్పుడు జెకె 5 ఓసిలో బొగ్గునిక్షేపాలు తగ్గుముఖం పట్టడం, జెకె పై ఓసి పొడిగింపు ప్రాజెక్టు పనులు ప్రారంభం కాకపోవడం వల్ల ఇల్లందు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందనే చెప్పొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుత గుర్తింపు సంఘం ముందస్తు ప్రణాళికలు లేకుండా, ఇల్లందు ఏరియా మనుగడ కోసం చర్యలు చేపట్టడం లేదనే అపవాదు ఉంది. ఏదోలా ఇల్లందు ఏరియా కనుమరుగు కాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏది ఏమైనా ప్రస్తుత సింగరేణిలో గుర్తింపు సంఘం ప్రధాన బాధ్యులు కొంత కలుగజేసుకొని ఇల్లందులో నెలకొన్న అంతర్గత ఆధిపత్య పోరును సరిచేసి కార్మికుల సమస్యలు, హక్కుల కోసం నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు చేసేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.